క్లుప్తంగా

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

టెక్కలి: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు వెల్లడించారు. కళాశాలలో ఐటీ విభాగం విద్యార్థులకు వెబ్ టెక్నాలజీస్ యూజింగ్ డిజింగ్ అనే అంశంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీజీఆర్ఎస్‌కు ఉన్నతాధికారులు హాజరు కావాలి

● అధికారులపై ఆర్డీవో ఆగ్రహం



ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమానికి కచ్చితంగా డివిజన్ స్థాయి అధికారులు హాజరు కావాలని.. అలా కాకుండా జూనియర్ అసిస్టెంట్‌లు, దిగువ స్థాయి సిబ్బందిని పంపితే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ విభాగానికి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు హాజరు కాకపోవడంపై ఏఈపై మండిపడ్డారు. ప్రజల నుంచి వస్తున్న వినతుల పరిష్కారం విషయంలో అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పలువురు నుంచి వినతులు స్వీకరించారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు 24 దరఖాస్తులు

కంచిలి: స్థానిక మండల పరిషత్ ఆధ్వర్యంలో కంచిలి-2 సచివాలయంలో మూడు రోజులుగా నిర్వహించిన పీఎం ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి 24 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో వి.తిరుమలరావు సోమవారం తెలిపారు. 21 నుంచి 24 సంవత్సరాల మధ్య గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. మరో పది మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ వారి వయస్సు 24 సంవత్సరాలు దాటడంతో వాటిని పరిగణనలోకి తీసుకోలేదన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

సోంపేట: ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు అన్నారు. సోమవారం బారువ గ్రామంలో హెల్మెట్ ప్రాముఖ్యత తెలియజేస్తూ ద్విచక్ర వాహనాలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు, సచివాలయాల సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ వినతి



జిల్లా కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను సోమవారం జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని లండారిపుట్టుగ గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్డు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో నిధులు మంజూరు చేయాలన్నారు. అలాగే లండారిపుట్టుగలో ప్రాథమిక పాఠశాల ప్రహరీ, లండారిపుట్టుగ గ్రామ పంచాయతీ జేఎస్ఎన్‌హెచ్ రోడ్ నుంచి పొందూరు పుట్టుగ గ్రామం వరకు రోడ్డు నిర్మాణాలకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వివిధ ఉద్యోగుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

రోడ్డు పనులు వేగవంతం చేయండి

వజ్రపుకొత్తూరు: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మంజూరైన బీటీ రహదారుల నిర్మాణాలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ డీఈఈ జి.రవిబాబు కాంట్రాక్టర్లను ఆదేశించారు. కొత్తపేటలోని రైతు సేవా కేంద్రం నుంచి దేవునల్తాడ వరకు ఉన్న కచ్చా రహదారిని రూ.1.10 కోట్లతో బీటీ రహదారిగా మార్చేందుకు ఉన్న అవకాశాలను సోమవారం పరిశీలించారు. మండలంలో 11 పనులు ప్రారంభమైనట్టు చెప్పారు. పనులు మార్చి ముగిసేలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు దుర్రి నారాయణస్వామి, గోవింద పాపారావు, ఎ.రఘుపతిరావు ఉన్నారు.

ఆ.. భవనాలపై దృష్టి పెట్టరా..?

- గత ప్రభుత్వ హయాంలో పక్కా భవనాల నిర్మాణం
- తుదిదశలో ఉన్నవాటిపై దృష్టి సారించని కూటమి సర్కార్



టెక్కలి ఎన్టీఆర్ కాలనీలో చివరిదశలో నిలిచి పోయిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రం భవనాలు



టెక్కలి చేరీవీధిలో ఒకే సామాజిక భవనంలో నిర్వహిస్తున్న గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం

టెక్కలి: ప్రజలు మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రాలకు రాకుండా నేరుగా గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలు పొందే విధంగా గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తూ అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లె పాలనకు శ్రీకారం చుట్టారు. భవన నిర్మాణ పనులు సైతం శరవేగంగా చేపట్టారు. అయితే ఈక్రమంలో ఎన్నికలు రావడంతో కొన్ని గ్రామాల్లో భవనాలకు రంగులు వేయడం, మౌలిక సదుపాయాలు, విద్యుత్ పనులు నిలిచిపోయాయి. లక్షలాది రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత పల్లె పండుగ పేరుతో హడావుడి చేశారు తప్పా శాశ్వతమైన భవనాలపై వివక్షత చూపారంటూ విమర్శలు తలెత్తుతున్నాయి. తుదిదశలో ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేసి పల్లె పాలన అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

తుది దశలో 53 భవనాలు

టెక్కలి నియోజకవర్గంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలకు సంబంధించి తుది దశ నిర్మాణంలో 53 భవనాలు ఉన్నాయి. వీటికి సంబంధించి సుమారు 4.31 కోట్ల రూపాయల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో టెక్కలి మండలంలో 33 భవనాలకు సుమారు రూ. 2.44 కోట్లు, కోటబొమ్మాళి మండలంలో 12 భవనాలకు సంబంధించి సుమారు రూ.1.48 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే సంతబొమ్మాళి మండలంలో రెండు భవనాలకు సుమారు రూ.15.96 లక్షలు, నందిగాం మండలంలో ఎనిమిది భవనాలకు సంబంధించి సుమారు రూ.1.50 కోట్ల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వీటిపై దృష్టిసారించి పూర్తి చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రజలు కోరుతున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం



గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో నిర్మాణం తలపెట్టిన వివిధ రకాల భవనాల్లో తుది దశకు చేరుకున్న వాటి వివరాలను సేకరించాలని ఇప్పటికే మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ఆయా వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.

–ఎ.ప్రకాశరావు,
ఈఈ, పంచాయతీరాజ్ విభాగం, టెక్కలి

తరగతుల విలీనాన్ని నిలిపి వేయాలని విజ్ఞప్తి



ఎంఈవో శివరాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్, బొనమాళి గ్రామస్తులు

కంచిలి: మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధి బొనమాళి ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను జెన్నాగాయి పాఠశాలలో విలీనం చేసే ప్రక్రియను విద్యాశాఖాధికారులు నిలిపివేయాలని స్థానిక సర్పంచ్ గణప సింహాచలం ఆధ్వర్యంలో గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారంతా మండల విద్యావనరుల కేంద్రానికి సోమవారం వచ్చి నిరసన తెలియజేశారు. జెన్నాగాయిలో ప్రభుత్వ మోడల్ స్కూల్ ఏర్పాటు చేసే భాగంలో బొనమాళి పాఠశాలలో 3, 4, 5 తరగతులను విలీనం చేయడం వలన పేదవర్గాలకు చెందిన పిల్లలు అక్కడికి వెళ్లి చదువుకోవడం భారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జెన్నాగాయి గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన చెరువులున్నాయని, వీటిని దాటి పిల్లలు రోజూ రాకపోకలు సాగించడం చాలా ప్రమాదకరమన్నారు. పైగా చిన్నపిల్లలు పుస్తకాలు బ్యాగులు భుజాన మోసుకుంటూ పక్క గ్రామానికి వెళ్లడం అసమంజసమని వాపోయారు. విద్యాశాఖాధికారులు దీన్ని పునఃపరిశీలించి, తరగతులు విలీనం ఆలోచనను వెనక్కుతీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వినతిపత్రాన్ని ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్‌కు అందజేశారు. కుమ్మరిపేట పాఠశాలలో 3, 4, 5, తరగతులను బొగాబెణి పాఠశాలలో విలీనం చేసే యోచన కూడా విరమించుకోవాలని సర్పంచ్ సింహాచలం ఈ సందర్భంగా కోరారు. నిరసన కార్యక్రమంలో స్థానికులు గుమ్మడి వెంకటరావు, గణప రామారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

వజ్రపుకొత్తూరు రూరల్: రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని రైతు సంఘ నాయకులు ఎస్.మోహన్‌రావు,కె.బాలాజీ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. దీంతో దిక్కుతోచక ధాన్యం బస్తాలను కళ్లాల్లో, పొలాల్లోనే నిల్వ పెట్టుకోవల్సిన పరిస్థితి దాపరించిందని అవేదన వ్యక్తం చేశారు. అలాగే ధాన్యం విక్రయించిన రైతులకు సైతం రోజులు గడుస్తున్న వారి బ్యాంక్ ఖాతాలలో డబ్బులు జమకాక ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం ధాన్యం సేకరణ చేపట్టాలని కోరుతూ తహసీల్దార్ సీతారామయ్యకు వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో ప్రజా సంఘ నాయకులు, రైతులు ఎస్.చంద్రయ్య, టి.భాస్కరరావు, ఆర్.నీలాచలం, బి.రామకృష్ణ ఉన్నారు.

29న దివ్యాంగుల ఉపకరణాలకు గుర్తింపు శిబిరం

టెక్కలి:దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల కోసం ఈ నెల 29న టెక్కలి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డివిజన్ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీబాయి సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు (లేకపోతే) ఓటరు కార్డు, ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజు ఫొటోలు (అంగ వైకల్యం కనిపించే విధంగా ఉండాలి) తదితర వాటితో హాజరు కావాలన్నారు. టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం, పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలకు చెందిన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యార్థినికి అభినందనలు

సోంపేట: సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని తెలుకుల సోనాలి సాహు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ఆంగ్ల విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. దీంతో ఆమెను సోంపేట సత్యసాయి మందిరంలో సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో వెండి పతకం, ప్రశంసా పత్రంతో సత్యసాయి సేవాసమితి సభ్యులు సోమవారం అభినందించారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దబద్ర ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు గొర్లె నాగేశ్వరరావు శివాజీ నగర్‌లో నడుపుతున్న గోనారా వికాస గ్రంథాలయానికి ప్రముఖ సైక్రియార్టిస్టు డాక్టర్ బి.పట్టాభిరాం 50 పుస్తకాలను వితరణ చేశారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన ఈ పుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అందరూ ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం నాగేశ్వరరావు కోరారు.

జలజీవన్ మిషన్ పనులు ప్రారంభం

ఇచ్ఛాపురం రూరల్: బాలకృష్ణాపురం పంచాయతీలో జల్‌జీవన్ మిషన్ ఇంటింటికీ కుళాయి పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ బతకల కుమారి పనులను ప్రారంభించారు. పనులు పూర్తయితే గ్రామస్తులకు నీటి సమస్య పరిష్కారమవుతోందన్నారు. స్థానిక నాయకుడు బోరుబద్ర లోహిదాసు పాల్గొన్నారు.

చెరువుకు వెళ్లేందుకు దారి చూపండి

వజ్రపుకొత్తూరు: గోవిందపురంలో ఎర్రబంద చెరువుకు వెళ్లేందుకు దారి చూపాలని రైతులు కోరారు. ఈ మేరకు ఆయకట్టు రైతులు సోమవారం తహసీల్దార్ గ్రీవెన్స్‌లో తహసీల్దార్ సీతారామయ్యకు వినతి పత్రం అందజేశారు. చెరువుకు వెళ్లే దారి ఆక్రమణలకు గురైందని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తమ భూములు సాగు చేసేందుకు పొలాలకు వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నామన్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో రైతులు బమ్మిడి కేశవ నారాయణ, బద్రి చిన్నారావు, డొక్కరి సవరయ్య, మృత్యుంజయరావు ఉన్నారు.

జీడి కార్మికుల వెల్ఫేర్ బోర్డు పునరుద్ధరించాలి

కాశీబుగ్గ: జీడి కార్మికులకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని కాష్యూ లేబర్ అసోసియేషన్ నాయకులు శిష్టు గోపి, అంబటి ఆనందరావు, నెయ్యిల గణపతి కోరారు. ఈ మేరకు కాశీబుగ్గలో లేబర్ అధికారి విజయ్‌కుమార్‌ను సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. వెల్ఫేర్ పథకం అమల్లో లేకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారన్నారు.

మున్సిపల్ గ్రీవెన్స్‌కు 12 వినతులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 12 వినతులు వచ్చాయని కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. ఆస్తిపన్ను, పేరు మార్పు, టిడ్కో ఇళ్లు, డెత్ సర్టిఫికెట్లు, వితంతు పింఛన్లకు సంబంధించి వినతులు అందాయన్నారు. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని కమిషనర్ చెప్పారు.

సూర్యదేవా..నమోస్తుతే..

సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వక్తలు అన్నారు. ఫిబ్రవరి నాలుగో తేదీన రథసప్తమి సందర్భంగా జిల్లా కలెక్టర్, విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పాఠశాలలు, కళాశాలల్లో సోమవారం సామూహిక సూర్య నమస్కారాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య నమస్కారాలతో చేకూరనున్న ప్రయోజనాన్ని పిల్లలకు తెలియజేశారు. అనంతరం వారితో కలిసి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అధికారులు సూర్యనమస్కారాలు చేశారు.

–సాక్షి నెట్‌వర్క్



ఇచ్ఛాపురం రూరల్: ధర్మపురం ఉన్నత పాఠశాలలో సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం కంద్రావార్డు హైస్కూల్లో సూర్య నమస్కారాల్లో పిల్లలు



సంతబొమ్మాళి ఆదర్శ పాఠశాలలో సూర్య నమస్కారాలు చేస్తున్న ఎంఈవోలు జలుమూరు చిన్నవాడు, అర్జునుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు



కవిటి: ఇద్దివానిపాలెం ఉన్నత పాఠశాలలో సూర్యనమస్కారాల సాధనలో బాలబాలికలు



ఇచ్ఛాపురం: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సామూహిక సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థినులు



కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ క్రీడా మైదానంలో తహసీల్దార్ కల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో..



కాశీబుగ్గ: రామక్రిష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో సూర్యనమస్కారాలు చేస్తున్న ఆర్డీవో వెంకటేష్ తదితరులు



కాశీబుగ్గ: మందసలోని జీజే కళాశాలలో సూర్య నమస్కారాల్లో ఎంఈవో లక్ష్మణరావు, విద్యార్థులు



పలాస: బొడ్డపాడు ఉన్నత పాఠశాలలో సూర్యనమస్కారాలు..

పుస్తకాలు వితరణ



వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు సంబంధించి యూటీఎఫ్ శాఖ సౌజన్యంతో సోమవారం శ్రీస్నేహ కళామండలి ఆర్థిక సాయంతో మోడల్ పేపర్ పుస్తకాలు వితరణగా అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరాలంటే పాఠశాల విద్య కీలకమన్నారు. టెన్త్ పరీక్షల్లో సత్తా చాటాల అకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, యూటీఎఫ్ ప్రతినిధులు ఢిల్లేశ్వరరావు, రామకృష్ణ, మోహన్‌రావు, తిరుపతి, రమేష్, బాలకృష్ణ ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

విగ్రహావిష్కరణ



ఇచ్ఛాపురం మండలం కేశుపురం గ్రామ బస్టాండ్ ఆవరణలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ మహానాయకుడని, రాజకీయంగా అందరికీ ఆదర్శనీయమన్నారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

కుట్టుమిషన్లు అందజేత



కోల్‌ఇండియా ఆర్థిక సహకారం.. రోటరీ క్లబ్ సౌజన్యంతో అందజేస్తున్న కుట్టుమిషన్లను వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందాలని రోటరీక్లబ్ మాజీ గవర్నర్ దత్తా అన్నారు. సోంపేట రోటరీ క్లబ్‌లో సోమవారం ఐదు లక్షల రూపాయలు విలువ చేసే కుట్టుమిషన్లను 15 మంది నిరుపేద మహిళలకు అందజేశారు. రోటరీ పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ దుద్ది శ్రీనివాసరావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు జుత్తు చలపతిరావు, కార్యదర్శి శివాజి, అసిస్టెంట్ గవర్నర్ రజనీకాంత్, సభ్యులు టంకాల బాబు, రవికుమార్ ఉన్నారు.

– సోంపేట

వాహనాల తనిఖీ



వాహనదారులు విధిగా రికార్డులు తమ వెంట తెచ్చుకోవాలని టెక్కలి ఎస్ఐ రాము అన్నారు. స్థానిక తెంబూర్ రోడ్డు, వైఎస్సార్ జంక్షన్ వద్ద ఎస్ఐ రఘునాథరావుతో కలిసి సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

–టెక్కలి రూరల్

ఫీల్డు అసిస్టెంట్‌ను నియమించండి



ఎంపీడీవోకు వినతపత్రం అందజేస్తున్న బొడ్డపాడు గ్రామస్తులు

పలాస: బొడ్డపాడు గ్రామంలో ఫీల్డు అసిస్టెంటు పోస్టును తక్షణమే భర్తీ చేయాలని గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులు కోరారు. ఈ మేరకు ఎంపీడీవో కె.వసంతకుమార్, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావుకు సోమవారం వినతి పత్రాలు అందజేశారు. ఫీల్డు అసిస్టెంటు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులను కలిసిన వారిలో గ్రామ పెద్దలు కిక్కర డిల్లీరావు, గర్తం తులసీరావు ఉన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి



క్రీడా విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిల్లీరావు

పలాస: పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సంపాదించే విద్యార్థులకు రూ. 50 వేల నగదు బహుమతి అందిస్తానని జెస్సీ ఈవెంట్స్ మేనేజరు కిక్కర డిల్లీరావు చెప్పారు. పలాస మండలం బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సబ్జెక్టుకు ఐదు వేల రూపాయల చొప్పున నగదు బహుమతి ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో రాణించిన పలువురు విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయులు ఎ.వీర్రాజు, సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ సభ్యుడు మద్దిల పాపారావు, పీడీ సీహెచ్ రామ్‌జీ, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు గర్తం తులసీరావు, సార జోగారావు పాల్గొన్నారు.

మహిళా పోలీసుకి అవార్డు ప్రదానం



విజయానంద్ నుంచి అవార్డు అందుకుంటున్న నీలవేణి

కాశీబుగ్గ: మందస మండలం బహడపల్లి విలేజ్ మహిళా పోలీస్ ఎల్ నీలవేణికి అరుదైన గౌరవం దక్కింది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అమరావతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీఎస్ విజయానంద్ చేతుల మీదుగా నీలవేణి ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్నారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. తోటి ఉద్యోగులు, తహసీల్దార్ ఎస్.హైమవతి, డీటీ రామకృష్ణ, ఆర్ఐ ఎస్.చిన్నారావులు ఆమెను అభినందించారు.

సక్రమంగా ఉల్లాస్ అమలు



వలంటీర్లకు పుస్తకాలు అందజేస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణ

కాశీబుగ్గ: మందస మండల పరిధిలో వయోజన నిరక్షరాస్యులను తీర్చి దిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ పథకాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని ఎంపీడీవో పైల సూర్యనారాయణ సూచించారు. మందస మండల స్థాయి ఉల్లాస్ రెండవ విడత వలంటీర్లకు శిక్షణ తరగతులను మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన, కుటుంబ సంక్షేమంతో పాటు తదితర జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటమే ఉల్లాస్ పథకం ఉద్దేశమన్నారు. నిరక్షరాస్యులకు రోజు రెండు గంటలపాటు మొత్తం 200 గంటల బోధన చేయాలని వలంటీర్లకు సూచించారు. అనంతరం వలంటీర్లకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఏవోబీ రుషేశ్వరరావు, ఈవోఆర్ డి.జయప్రకాష్, ఏపీఎం పైడి కూర్మారావు, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

జయరాంకు వాణి పరామర్శ



జయరాం కుటుంబ సభ్యులతో దువ్వాడ వాణి తదితరులు

నందిగాం: అక్రమ కేసులో ఇటీవల అరెస్టయి విడుదలైన నందిగాంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, స్థానిక సర్పంచ్ జడ్యాడ రమణమ్మ కుమారుడు జయరాంను టెక్కలి జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్రమం కేసులకు భయపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ఆమె వెంట టెక్కలి ఎంపీపీ ఆట్ల సరోజినమ్మ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కిలి గోవిందరావు, మోహన్‌రెడ్డి, కామేష్, అప్పన్న, రామారావు, అప్పలనాయుడు, దట్టి శాంతారావు, ఆట్ల రాహుల్‌కుమార్, లోకనాథం ఉన్నారు.